నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 17 జూన్ 2025 | HYDERABAD


## క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయండి



### కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు ఎమ్మెల్యే మర్రి వినతి

మల్కాజిగిరి, జూన్ 16: నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సఫిల్‌గుడా మినీ ట్యాంక్‌బండ్, అల్వాల్ కొత్తచెరువు మీద మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, చాకలి ఐలమ్మ, సర్వాయి పాపన్న గౌడ్, ప్రొఫెసర్ జయశంకర్, ప్రజా గాయకుడు గద్దర్ వంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు.

## వర్ష సూచన

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సోమవారం రాత్రి నగరంలోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.4, కనిష్ఠం 22.6 డిగ్రీలు, గాలిలో తేమ 59 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.





### అటకెక్కిన మెట్రో ఫేజ్-2

కేంద్రానికి చేరిన డీపీఆర్

6 నెలలు గడిచినా..

లభించని మోక్షం

టెక్నికల్ సమస్యలపై

చర్చలతో కాలయాపన

## గులాబీ సైన్యం..సంఘీభావం




తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బంజారాహిల్స్,జూన్ 16: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫార్ములా ఈ రేసింగ్ కేసులో ఏసీబీ విచారణకు హాజరయిన సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పోటెత్తారు. పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు తరలిరావడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. వరదలా వస్తున్న బీఆర్‌ఎస్ నేతలతో భవన్ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం 9.30 ప్రాంతంలో నందినగర్ నివాసం నుంచి బయలుదేరిన కేటీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ పార్టీనేతలు, కార్యకర్తలను కలిసి ఉదయం 10గంటలకు బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లారు. విచారణ అనంతరం కేటీఆర్ నందినగర్‌లో నివాసానికి చేరుకోగా అక్కడ ఆయనకు దిష్టితీసి లోపలికి స్వాగతం పలికారు.



ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణ అనంతరం ఇంటికి చేరుకున్న కేటీఆర్ కు దిష్టి తీస్తున్న సిబ్బంది..
చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్



### అభ్యంతరాలపై వివరణ ఇవ్వాల్సిందే..

గ్రామ, ప్రజాభిప్రాయ సేకరణ సభలు బహిష్కరించినా... వివరణ చెప్పాలంటూ నోటీసులు

ఎలివేటెడ్ కారిడార్ బాధితులపై సర్కారు ఒత్తిడి

ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు

›IVలో

# అక్రమమైతే..సీజ్

అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ మరింత కఠినం..

సీజ్ చేయడంలో జోనల్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు..

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పక్కాగా నిబంధనల అమలు..

ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

సిటీబ్యూరో: అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ విభాగం మరింత కఠినంగా వ్యవహరించనున్నది. ఇక మీదట సంబంధిత భవనాన్ని సీజ్ చేయనున్నారు. సదరు భవనం చుట్టూ ఎరుపు రంగు రిబ్బన్‌ను చుట్టడం, గేటుకు తాళం వేసి లక్కతో సీల్ చేయడం, తలుపులు లేకపోతే భవనం పరిసరాలను కర్రలు, చెక్కలు, ఇతర వస్తువులతో మూనేసి దాని చుట్టూ రిబ్బన్‌ను చుట్టి దానిపై అధికారి సంతకం సీల్ వేస్తారు. ఇటీవల హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.అక్రమ నిర్మాణమని తేలితే చాలు ముందుగా పనులు జరగనీవ్వకుండా ఆ భవనాన్ని సీజ్ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆర్ వీ కర్ణన్.. జోనల్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఇక మీదట కూల్చివేత ఉత్తర్వు (స్పీకింగ్ ఆర్డర్)కు ముందు లేదా ఆ ఉత్తర్వు ఇచ్చాక ఆమోదం పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా జరిగే నిర్మాణాలను అనుమతి లేని భవనాలను జీహెచ్‌ఎంసీ చట్టం -1955లోని సెక్షన్ 461-ఏ కింద జీహెచ్‌ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ , డిప్యూటీ కమిషనర్ సీజ్ చేయనున్నారు. ఒకసారి సీల్ వేసిన భవనాన్ని తెరిచే అధికారం కొందరికే ఉంటుంది.. డిప్యూటీ కమిషనర్ సీజ్ చేసిన భవనాన్ని జోనల్ కమిషనర్, జోనల్ కమిషనర్ సీజ్ చేసిన భవనాన్ని కమిషనర్ మాత్రమే తొలగించాల్సి ఉంటుంది.



### 15 రోజుల వ్యవధితో షోకాజ్ నోటీసు

నిర్మాణ జరిగిన ప్రాంతాన్ని తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణదారుడిపై నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. దాని ఆధారంగా నిర్మాణదారుడు అనుమతి లేకుండా చేపట్టిన భవనం, అంతస్తులు, ప్లాన్‌ను ఉల్లంఘించిన చేపట్టిన భాగాన్ని ఎందుకు 15 రోజుల్లో కూల్చకూడదో తెలుపుతూ సంబంధిత యాజమానికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. నోటీసును యజమానికి అందజేయడంతో పాటు అందినట్లుగా సదరు నిర్మాణదారులు, సంస్థ సంతకం తప్పనిసరి. సమాంతరంగా నోటీసును జిల్లా కలెక్టర్, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం బాధ్యులకు, జోనల్ కమిషనర్లకు ఈ మెయిల్ ద్వారా చేర్చాల్సి ఉంటుంది. నోటీసు అందుకున్నాక కూడా నిర్మాణ పనులు కొనసాగుతుంటే జీహెచ్‌ఎంసీ సదరు భవనాన్ని సీజ్ చేసి తదుపరి విచారణ చేపట్టే అవకాశం ఉంటుంది. అప్పటికే ఆ నిర్మాణాన్ని ఎవరైనా వినియోగిస్తున్నట్లయితే ఖాళీ చేసేందుకు వారికి మూడు రోజుల గడువు ఇచ్చి తర్వాత సీజ్ చేయాలి.

### భవనం సీజ్ చేసిన తర్వాత ఏం చేస్తారంటే ?

సంబంధిత అనధికారిక భవనం చుట్టూ ఎరుపు రంగు రిబ్బన్‌ను చుట్టడం, గేటుకు తాళం వేసి లక్కతో సీల్ చేయడం, తలుపులు లేకపోతే భవనం పరిసరాలను కర్రలు, చెక్కలు, ఇతర వస్తువులతో మూనేసి దాని చుట్టూ రిబ్బన్‌ను చుట్టి దానిపై అధికారి సంతకం సీల్ వేస్తారు. ఈ ప్రక్రియలో పాల్గొన్న అధికారులు, పోలీసుల పేర్లతో ఎలా సీల్ వేశారో తెలుపుతూ ఫొటోలు, వీడియోలను జత చేసి సంబంధిత అధికారి కమిషనర్‌కు నివేదిక పంపించనున్నారు. తదుపరి వెంటనే విద్యుత్, జలమండలికి సీజ్ చేసిన నివేదికను పంపించి విద్యుత్, తాగునీటి కనెక్షన్లను నిలిపివేయాలని లేఖ రాయనున్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌కు , సబ్ రిజిస్ట్రార్ – మిగతా IV లో



### ఆధార్ లేదని పుస్తకాలు ఇవ్వలేదు

11 వేల మందికి నిరాకరణ

అధికారుల నిర్లక్ష్యం వల్లే రాలేదంటూ

తల్లిదండ్రుల ఆగ్రహం

›IVలో



**గాంధీలో గంటల కొద్దీ క్యూ**

సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో సోమవారం కనిపించిన దృశ్యమిది. రోగులతో ఓపీ విభాగం కిక్కిరిసిపోయింది. గంటల తరబడి క్యూలో నిల్చొని డాక్టర్‌ను సంప్రదించిన తర్వాత.. మందుల కోసం రెండోసారి భారీ క్యూ తప్పలేదు. అయితే డాక్టర్ రాసిన మందుల్లో కొన్ని మాత్రమే వైద్యశాలలో అందుబాటులో ఉండటంతో బయట మెడికల్ షాపుల్లో తీసుకోవాల్సిందిగా సిబ్బంది సూచించడంతో రోగుల సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇక ఎక్సైజ్‌లోనూ ఆన్‌లైన్ ప్రక్రియ

ఎఫ్ఐఆర్ నమోదులో మాన్యువల్ పద్ధతికి ఫుల్‌స్టాప్

ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో నమోదు





అధికారులతో సమావేశమైన ఆబ్కారీ ఈడీ షానవాజ్ ఖాసీం

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఆబ్కారీలోనూ ఆన్‌లైన్ విధానానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. పోలీస్ శాఖ తరహాలోనే ఆబ్కారీ శాఖలో కూడా పరిపాలనకు సంబంధించిన అంశాలతో పాటు ఎఫ్ఐఆర్‌ల నమోదు తదితర అంశాలను సైతం ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చేందుకు ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ప్రభుత్వాన్ని నడిపించడంలో ఆర్థికంగా కీలక పాత్ర పోషించే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ దురదృష్టవశాత్తు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ విభాగాలు డిజిటలైజేషన్‌తో పరుగులు తీస్తుంటే తెలంగాణ ఆబ్కారీ శాఖలో మాత్రం ఇంకా మ్యాన్‌వల్ పద్ధతితోనే సర్దుకు పోతున్నారు. దీనిపై ఆలస్యంగా స్పందించిన ఆబ్కారి అధికారులు ఎట్టకేలకు ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టారు.

### ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే ఎఫ్ఐఆర్

ప్రస్తుతం ఆబ్కారీ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 139ఎక్సైజ్ స్టేషన్‌లు ఉన్నాయి. ఈ స్టేషన్‌ల పరిధిలో ఆబ్కారీ నేరాలకు పాల్పడే వారిపై ఇప్పటి వరకు మ్యాన్వల్ పద్ధతిలోనే ఎఫ్ఐఆర్‌లను నమోదు చేస్తున్నారు. అంతే కాకుండా ఆబ్కారీ శాఖలోని పలు రకాల కార్యకలాపాలను సైతం మాన్యువల్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నారు. మ్యాన్‌వల్ పద్ధతిలో జారీ చేసే ఎఫ్ఐఆర్‌లలో అవకతవకలకు ఆస్కారం లేకపోలేదు. అంతే కాకుండా కేసుల నమోదులో కూడా పారదర్శకత ప్రశ్నార్థకమే. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న అధికారులు అధికారుల్లో జవాబుదారితనం పెంచడం, పనితనంలో పారదర్శకత తదితర వాటికోసం అన్ని ఎక్సైజ్ స్టేషన్‌లలో ఇక నుంచి ఎఫ్ఐఆర్ నమోదులో మ్యాన్‌వల్ పద్ధతికి స్వస్తి పలికి, ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు చేయనున్నట్లు ఆబ్కారీ ఈడీ షానవాజ్ ఖాసిం వెల్లడించారు.

### ఆగస్టు నుంచి అమల్లోకి ఆన్‌లైన్ విధానం:

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆబ్కారీ స్టేషన్‌లలో ఆగస్టు నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకు వచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎస్ఐసీ సంస్థ సాంకేతిక నిపుణులు, ఎక్సైజ్ అధికారులతో ఆబ్కారీ ఈడీ షానవాజ్ ఖాసిం సమావేశమయ్యారు. పోలీసు శాఖ తరహాలోనే ఎఫ్ఐఆర్ నమోదు, కేసుల దర్యాప్తు పురోగతితో పాటు ఇతర అంశాలను సైతం ఆన్‌లైన్ పద్ధతిలోకి తీసుకురావడానికి అవసరమైన అంశాలపై చర్చించారు. ఈ నెల 25న జరిగే సమావేశంలో ఆన్‌లైన్ విధానంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ విధానానికి సంబంధించిన సాంకేతికత అంశాల రూపకల్పకు జూలైలోపు తుది రూపం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.



### గీత దాటితే.. వాత తప్పదు..

ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే.. కెమెరాకు చిక్కాల్సిందే..

రోజుకు సగటున 15,438 ట్రాఫిక్ చలాన్లు..

2వేల చలాన్లు కెమెరాలు వేసినవే..

సిటీలో యాక్టివ్‌గా 284 కెమెరాలు..

IIలో

## ఆ జీవోతో ఆటో డ్రైవర్లకు తీరని నష్టం

ఖైరతాబాద్, జూన్ 16: ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.263 నుంచి సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలను మినహాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆటో యూనియన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేత ఇబ్రహీం మాట్లాడుతూ గతేడాది ప్రభుత్వం జీవో నం.41ను తీసుకువచ్చిందని, తద్వారా డ్రైవర్లు అధిక సంఖ్యలో ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. తాజాగా 20వేల విద్యుత్ ఆటోలతో పాటు పది వేల సీఎన్జీ, మరో పది వేల ఎల్పీజీ వాహనాలకు సైతం పర్మిట్లు కల్పిస్తూ జీవో నం. 263ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ జీవోతో విద్యుత్ ఆటోలను వినియోగించుకోవాలనుకుంటున్న డ్రైవర్లకు తీరని నష్టం జరుగుతుందన్నారు.




## సీఎం ఇంటి ముట్టడికి యత్నం

బంజారాహిల్స్, జూన్ 16: నిరుద్యోగులను అడ్డుపెట్టుకుని సీఎం పీఠం ఎక్కిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విద్యార్థుల రాజకీయ పార్టీ(వీఆర్‌పీ) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భాగవతుల సాయి మహేశ్ అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ వీఆర్‌పీ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్ నివాసం ముట్టడికి యత్నించగా, నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్రధాన రోడ్డుపై బైఠాయించిన వీఆర్‌పీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రేటర్ అధ్యక్షుడు సాయి మహేశ్ మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తా అంటూ ఇచ్చిన హామీ, ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు.



## ఓఆర్‌ఆర్ బాధితుల నిరసన

సిటీబ్యూరో: ఓఆర్‌ఆర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారంగా అప్పట్లో హెచ్‌ఎండీఏ సమీపంలోనే భూ సేకరణ చేసి.. ప్లాట్ల అభివృద్ధి కోసం పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించి చేతులు దులుపుకొన్నది. రైతులు, నిర్మాణదారులకు ఘట్‌కేసర్ సమీపంలోని కొండాపూర్ వద్ద 100 ఎకరాల విస్తీర్ణంలో భూములను కేటాయించి, ప్లాట్లుగా అప్పగించారు. కాంట్రాక్టర్ మౌలిక వసతులు కల్పించలేదు. సుమారు 15 ఏండ్ల తర్వాత హెచ్‌ఎండీఏ అధికారులు సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా.. తమను వేధింపులకు గురిచేస్తున్నారంటూ..హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయానికి బాధితులు చేరుకున్నారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో నిరసన వ్యక్తం చేసిన అనంతరం వినతిపత్రాన్ని అధికారులకు అందజేసినట్లు ఘట్‌కేసర్ ఓఆర్‌ఆర్ బాధితుల సంఘం సభ్యులు పేర్కొన్నారు.

